ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు

**ANDHRA PRADESH**
**LEGISLATIVE COUNCIL DEBATES**

అధికార నివేదిక

# OFFICIAL REPORT

బుధ వారం, మార్చి 3 , 2011

పధ్నాల్గవ సమావేశము, సంపుటము II, నంబరు. 3

వికృతి నామ సం. మాఘ బ. 14

**TUESDAY, THE 3RD MARCH, 2011**

**FOURTEENTH SESSION, VOLUME II, NO. 3**

**12 PHALGUNA, 1932 S.E.**

*****


శాసన పరిషత్తు సచివాలయము,

పబ్లిక్ గార్డెన్స్,

హైదరాబాద్ – 500 004.

**LEGISLATURE SECRETARIAT,**
**PUBLIC GARDENS,**
**HYDERABAD - 500 004.**

## ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| **ఛైర్మన్** | ః | డా. ఎ. చక్రపాణి |
| **డెప్యూటీ ఛైర్మన్** | ః | శ్రీ మహ మ్మద్ జానీ |
| **ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక** | ః | శ్రీ గిడుగు రుద్రరాజు |
| | | శ్రీ ఎస్. జగదీశ్వర్ రెడ్డి |
| | | శ్రీ టి.జి.వి. కృష్ణారెడ్డి |
| | | శ్రీ చుక్కా రామయ్య |
| **కార్యదర్శి** | ః | డా. ఎస్. రాజ సదారామ్ |
| **అదనపు కార్యదర్శి** | | శ్రీ ఎం.వి.వి. సత్యానందం |
| **ఉప కార్యదర్శులు** | ః | శ్రీ డి. నర్సింహులు |
| | | శ్రీ కె. సుభాష్ చంద్రబోస్ |
| | | శ్రీమతి వి. గిరిజాసుందరి |
| | | శ్రీ కె. సత్యనారాయణరావు |
| **ప్రత్యేక అధికారి** | : | శ్రీ ఎ. రామిరెడ్డి |
| **సహాయ కార్యదర్శులు** | ః | శ్రీ మహమ్మద్ జహీరుద్దీన్ |
| | | శ్రీ జి. వెంకట కృష్ణ |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| | | శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| | | శ్రీమతి బి. నరసమ్మ |
| | | శ్రీమతి టి. సుశీల |
| | | శ్రీ ఎం.వి.యస్. బాపిరాజు |
| | | శ్రీ జె. రామలింగేశ్వర రావు |
| | | శ్రీ ఎల్. తిరుమల రావు |
| | | శ్రీ కలపచెర్ల వెంకటేశ్వర రావు |
| | | శ్రీ ఎమ్. విజయరాజు |
| | | శ్రీ హెచ్.ఎ. షఫీ |
| | | శ్రీ వి. రమేష్ కుమార్ |
| **చీఫ్ మార్షల్** | ః | శ్రీ సిహెచ్.వి. చెట్టి |
| **చీఫ్ రిపోర్టర్** | ః | శ్రీమతి పోరంకి శివదీక్ష |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపములు
## అధికార నివేదిక
**బుధ వారం, మార్చి 3, 2011**

**విషయ సూచిక**

1. సభా కార్యక్రమం ః

    విషయం : శాసన పరిషత్ సభ్యురాలు డా. (శ్రీమతి ) కె. రాజ్యలక్ష్మి, ఎంఎల్సి గారి మృతి సూచకంగా సంతాప తీర్మానం .

* * * * *

ఆంధ్రప్రదేశ్ శాసనపరిషత్తు
**2011, మార్చి 3వ తేది, బుధ వారం**
పద్నాల్గవ సమావేశపు తొమ్మిదవ రోజు

(సభ ఉదయం **10.00** గంటలకు ప్రారంభమైనది. గౌరవ అధ్యక్షులు అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

* * *

*( సభ సమావేశమవగానే ప్రతిపక్ష సభ్యులు తమ ఎడ్జర్నమెంట్ మోషన్లను చర్చకు చేపట్టవలసిందిగా కోరుతూ తమ తమ స్థానాలలో లేచి నిలుచున్నారు. )*

----

మిస్టర్ ఛైర్మన్ : ముందుగా, మన సిట్టింగ్ సభ్యురాలు, ఎం.ఎల్.సి., డా.(శ్రీమతి) కె. రాజ్యలక్ష్మిగారు గతించారు, ఆ సందర్భంగా లెజిస్లేటివ్ ఎఫైర్స్ మినిష్టరు తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ తరువాత గౌరవ సభ్యులందరూ ఈ అంశానికి సంబంధించి మాట్లాడతారు. తదనంతరం, సభ్యులందరూ రెండు నిముషాల పాటు మౌనం పాటిద్దాము.

శ్రీ డి. శ్రీధర్ బాబు ( మంథని ) : అధ్యక్షా, డా. (శ్రీమతి) రాజ్యలక్ష్మిగారి మరణ వార్త అందరికీ కూడా దిగ్భ్రాంతిని కలిగించింది. డాక్టర్ కోలా రాజ్యలక్ష్మి గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్ సభ్యురాలు. వారి మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. డా. కోలా రాజ్యలక్ష్మిగారు ప్రముఖ సంఘ సేవకురాలు. వైద్య శాస్త్రంలో నిపుణులుగా పేరు గాంచిన డా. రాజ్యలక్ష్మిగారు 1931వ సంవత్సరం, సెప్టెంబర్ 27వ తేదీనాడు చిత్తూరు జిల్లాలోని పట్టిపుత్తూరు గ్రామంలో జన్మించారు. కాకినాడ వైద్య కళాశాల నుంచి, ఎం.డి. పట్టాను పొందారు. డా. కోలా రాజ్యలక్ష్మి గారు అనేక వైద్య కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేశారు. వీరు 1973వ సంవత్సరం నుండి 1986వ సంవత్సరం వరకూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌కు డైరెక్టరుగా, 1986వ సంవత్సరం నుండి 1990 వరకూ శ్రీ పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సిలర్‌గా పనిచేశారు. 1990వ సంవత్సరం నుండి 1994వ సంవత్సరం వరకూ ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేయడం జరిగింది. 2001వ సంవత్సరం నుండి 2007 వరకూ ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్రంలో కుక్క కాటుకు సంబంధించి రెబీస్ వ్యాక్సిన్ వాడకంపై ప్రజలలో అవగాహన పెంచడం కొరకు పెద్ద ఉద్యమాన్ని నడిపారు. వీరు వ్రాసిన అనేక వ్యాసాలు దేశీయ, అంతర్జాతీయ పత్రికలలో ప్రచురించబడ్డాయి. డాక్టర్ రాజ్యలక్ష్మి గారు 2007వ సంవత్సరం నుండి గవర్నరుగారిచేత ఆంధ్రప్రదేశ్ విధాన సభ సభ్యురాలిగా నామినేట్ చేయబడి, ప్రస్తుత సభ్యురాలిగా కొనసాగుతున్నారు. అంతేగాకుండా, వీరు అనుసూచిత జాతుల సంక్షేమ సమితిలో ప్రత్యేక ఆహ్వానితులుగా మరియు ప్రభుత్వ హామీల సమితి సభ్యురాలిగా కొనసాగుతున్నారు. వీరు ఆస్ట్రేలియా, అమెరికా, లండన్, జపాన్, స్వీడన్ మొదలైన అనేక దేశాలను కూడా సందర్శించారు. డాక్టర్ రాజ్యలక్ష్మిగారు

2011, మార్చి 2వ తేదీన స్వర్గస్థులైనారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, మనందరం రెండు నిమిషాలు మౌనం పాటించి, ఈ రోజుకు సభను వాయిదా వేయాలని గౌరవ ఛైర్మన్ గారిని కోరుతున్నాను.

శ్రీ దాడి వీరభద్ర రావు ( విశాఖపట్నం ) : అధ్యక్షా, డాక్టర్. రాజ్యలక్ష్మి గారు మనతో పాటు గత నాలుగు సంవత్సరాలుగా కలిసి ఉన్నటువంటి తోటి సభ్యురాలు, అకాల మరణం చెందడం మనందరికీ బాధాకరమైన విషయం. మన రాజ్యలక్ష్మి గారు హౌస్‌లో కూడా ఆమెకు ఇష్టమైన సబ్జక్టులు అంటే, విద్యా, వైద్యం మరియు ఆరోగ్యం, అలాగే ఎన్విరాన్‌మెంటులకు సంబంధించి చర్చలు జరుగుతున్నప్పుడు అందులో ఎక్కువగా పాల్గొంటూ, ఉత్సాహం చూపించేవారు. వీలైనంతవరకూ కూడా తాను ప్రభుత్వానికి ఏవైనా సలహాలు ఇవ్వదలచుకుంటే, ఆవిడ లేచి తన అభిప్రాయాలను చెప్పడం జరిగేది. ఆవిడ ముందు నుంచి ఒక డాక్టర్‌గా, విద్యావేత్తగా ఉంటూ ఉండేవారు. అదేవిధంగా స్వర్గీయ ఎన్.టి.రామారావుగారు ఆవిడను శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సిలర్‌గా నియమించడం జరిగింది. తరువాత కాంగ్రెస్ పార్టీలో యాక్టివ్‌గా ఆమె పని చేయడం, అన్ని రాజకీయ పార్టీల తాలూకు అభిమానాన్ని చూరగొన్నటువంటి వ్యక్తిగా ప్రభుత్వం గుర్తించి, గవర్నరుగారి చేత నామినేట్ చేయబడడం అందరికీ తెలిసినటువంటి విషయమే. ఆమె మరణం మన సభకు తీరని లోటే. ఆమె మరణం పట్ల తెలుగుదేశం పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆమె కుటుంబ సభ్యులందరికీ కూడా మా సానుభూతిని మరొకసారి తెలియజేస్తున్నాను.

శ్రీ పువ్వాడ నాగేశ్వరరావు ( ఖమ్మం ) : అధ్యక్షా, డా. అ(శ్రీమతి) రాజ్యలక్ష్మిగారు, నిన్నటిదాకా మన సభలో సభ్యురాలిగా ఉనారు. తిరిగి పునరుద్ధరించబడిన శాసన మండలిలో గత నాలుగు సంవత్సరాల నుంచి ఆవిడ మాతోపాటు సభ్యులుగా కొనసాగి, ఇంకా మరికొంతకాలం మనతో కలిసి ఉండేవారు. దురదృష్టవశాత్తూ, ఆమె ఆరోగ్యం సహకరించక చనిపోయారు. ప్రస్తుం ఆవిడ వయస్సు 80 సంవత్సరాలు అంటే, ఈ రోజు, రేపు కొంతమంది 90 సంవత్సరాలు, 100 సంవత్సరాల వరకూ జీవిస్తున్నారు. ఆవిడకు ఆరోగ్యం ఉంటే, మరికొంతకాలం సర్వీసులో ఉండి, ప్రజలకు సేవలందించే వారు. గత కాలంలో, ఈ సమాజ మార్పు కోసం మరియు మహిళలకు సాధికారత అనే దానిలో భాగంగా, ఎవరు ఏ కార్యక్రమాలు తలపెట్టినా, రాజ్యలక్ష్మిగారు గుర్తుకు వస్తూ ఉంటారు. నాకు తెలిసి, మొదటి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సిలర్‌గా శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయానికి ఆవిడ అపాయింట్ చేయబడ్డారు. సక్సెస్‌ఫుల్‌గా తన కెరీర్‌ను నడపగలిగారు. ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు కూడా ఒక క్రొత్త సబ్జెక్టు మీద వ్యాసాలు వ్రాశారు. డా. రాజ్యలక్ష్మి తనదైన శైలిలో లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా సక్సెస్‌ఫుల్‌గా తన బాధ్యతలను నెరవేర్చారు.

ఉ.10.10

సోషల్ సర్వీసెస్‌కు సంబంధించి రెడ్‌క్రాస్ సొసైటీకి దాదాపు 6 సంవత్సరాలు కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఇక్కడ సభ్యురాలిగా వున్న 4 సంవత్సరాలలో ఎప్పుడు మీ దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించి లేచి నిలబడినా ఆమెకు మీరు టైమ్ ఇవ్వని సందర్భమే లేదు. మిమ్మల్ని ప్రత్యేకంగా రిక్వెస్ట్ చేసి తాను చెప్పదల చుకున్న ఆ రెండు మాటలూ టైమ్ వృధా కాకుండా చెప్పే ముక్కుకు సూటి మనిషిగా, ఆమె మన మధ్య మెలి గారు. దురదృష్టవశాత్తు వారు మన నుంచి దూరమయ్యారు. ఆమె మరణం పట్ల శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మా పార్టీ తరపున బలపరుస్తున్నాను.

శ్రీ చేరుపల్లి సీతారాములు ( నల్గొండ ) ః అధ్యక్షా, డా. రాజ్యలక్ష్మి గారు 4 సంవత్సరాల పాటు మనతో పాటు సభలో వుండి, అనేక అంశాల మీద మనకు చాలా అమూల్యమైన సలహాలు ఇచ్చారు. ఆమె చాలా నమ్రత కలిగిన మనిషి. ఏమైనా సమస్యలు వచ్చినపుడు వాటి గురించి కాని, లేక ఫలానా అంశాల మీద మాట్లాడడం వల్ల ప్రజలకు ఉపయోగపడుతుందని కాని చాలా సందర్భాలలో నాకు సలహాలు ఇచ్చేవారు.

ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలు వచ్చినపుడు, హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ప్రస్తావనలు వచ్చినపుడు, ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేయాలనే తపన ఆమెలో కనిపించేది. ఆమెకు సాధ్యం కానపుడు ఈ విషయాలను గురించి మీరు మాట్లాడండి, నాకు మాట్లాడడానికి అవకాశం దొరకలేదని మాతో చాలా సందర్భాలలో చెప్పారు.

సుమారు 79 సంవత్సరాల వయసు కలిగి, ఈ వయస్సులో కూడా క్రమశిక్షణతో సభకు హాజరై వివిధ అంశాలను అధ్యయనం చేయడంతోపాటు వాటి గురించి సభలో చర్చించిన మంచి వ్యక్తి. ఆమె అనేక బాధ్యత లను నిర్వహించినట్లుగా మంత్రి గారు తెలియజేసారు. ఆమె శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గాను, ఎ.పి. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శిగాను, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగాను పని చేసారని పత్రికలలో చది వాను.

సుమారు, 3, 4 దశాబ్దాల కాలం పాటు వివిధ పదవులలో అత్యంత బాధ్యతాయుతంగా ఆమె తన బాధ్యతలను నిర్వహించారు. దళితులు, గిరిజనుల సమస్యల పట్ల ఆమె ఈ వయస్సులో కూడా బాగా స్పందించేవారు. ఆ విషయమై ఆమె ప్రభుత్వానికి తగిన సలహాలూ, సూచనలూ ఇస్తూ వుండేవారు. అటువంటి ఆమె మన మధ్య లేకుండా పోవడం చాలా బాధాకరమైన విషయం . అమె మృతి పట్ల మా పార్టీ తరపున నేను సంతాపాన్ని తెలియజేస్తూ, శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తు న్నాను.

శ్రీ దాచూరి రామిరెడ్డి ( ప్రకాశం ) ః  అధ్యక్షా, మొన్నటి వరకూ మన మధ్య వున్న డా. రాజ్యలక్ష్మి గారు మర ణించిన విషయం టి.వి.లో చూసి తెలుసుకోవడం జరిగింది.  వారితో అంతకు ముందు నాకు వ్యక్తిగత పరి చయం లేకపోయినా ఈ నాలుగు సంవత్సరాల కాలంలో కేవలం ఈ సభలోనే కాకుండా చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశాలకు ఒక రెగ్యులర్ మెంబర్‌గా వచ్చేవారు.  ఆరోగ్యం బాగోలేకపోయినా, రెగ్యులర్‌గా టైమ్ ప్రకారం వచ్చేవారు.  ఆమెకు సంబంధించి, ఇక్కడ ఎవరూ చెప్పని అంశం ఏమిటంటే ఈ నాలుగు సంవత్సరాల కాలంలో చెంచులు వుండే గ్రామాలకు వెళ్లి వారి జీవన పరిస్థితులు గమనించి, వాటిని అధ్యయనం చేసి ఒక పుస్తకాన్ని వ్రాసి గవర్నమెంట్‌కు సబ్మిట్ చేసారు.  ఆ కాపీ మా దగ్గర వుంది. ఎంతో శ్రమించి, ఆరోగ్యం బాగోలేకపోయినా అంతటి   క్లిష్టతరమైన బాధ్యతలు నిర్వహించారు. అటువంటి మంచి మనిషిని మనం కోల్పోవడం మన దురదృ ష్టం .  ఆమె మృతికి మా పిడిఎఫ్ తరపున సంతాపాన్ని తెలియజేస్తూ, శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ బి. మోహన్ రెడ్డి (మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ )  ః  అధ్యక్షా, డా. రాజ్యలక్ష్మి గారు చనిపోవడం చాలా బాధాకరమైన విషయం.  మా ముందు సీట్లో కూర్చునేవారు, చాలా సైలెంట్‌గా ఎంతో క్రమశిక్షణతో వుండే వారు.  క్రమశిక్షణ గురించి ఆమె దగ్గర తెలుసుకోవాలి. ఆమె శ్రీ పద్మావతి మహిళా యూని వర్సిటీ వైస్ ఛాన్సలర్ గాను, ఎ.పి. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శిగాను, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగాను ప్రజలకు అనేక సేవలు అందించారు.  ఈ నాలుగు సంవత్సరాల నుంచీ ఆమెను చూస్తున్నాము.  ఆమె ఈ విధంగా చనిపోతుందని అనుకోలేదు.  ఆమె స్వర్గలోకంలో వుండాలని కోరుకుంటూ, ఆమె మరణం పట్ల శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆమె ఆత్మకు శాంతి కలుగజేయాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీమతి నన్నపనేని రాజకుమారి ( గుంటూరు ) ః  అధ్యక్షా, డా. రాజ్యలక్ష్మి గారు ఈ రోజు ఈ సభలో లేకపోవడం చాలా దురదృష్టకరం.  ఆమె మరణించిందని బాధ ఒక వైపయితే, చివరిసారిగా ఆమెను చూడలేకపోయాననే బాధ మరొకవైపు.  ఎందుకంటే మా టివి ప్లగ్ పోయింది, వార్తలు చూడలేదు.  నేను ఊళ్లోనే వున్నా ఆమె మరణించిన విషయం  నాకయితే పేపర్ చూసే వరకూ తెలియదు.  ఆమెతో నాకు చాలా అనుబంధం వుంది.  నేను చాలా ఆవేదన చెందుతున్నాను.  ఆ రోజులలో ఆమె తెలుగుదేశంలో వుండే వారు. మేమంతా గెలిచిన తరువాత ఎన్‌టి రామారావు గారు ఆమెను ఒక పొలిటీషియన్‌గా చూడకుండా, ఒక విద్యావేత్తగాను, సంఘ సేవకురాలిగాను పరిగణించి, వనజా అయ్యంగార్ గారి తరువాత శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌గా నియమించడం జరిగింది, అక్కడ చాలా మంది హర్షించారు, ఆమె చాలా సమర్థవంతంగా పని చేసారు.

ఆ తరువాత ఆమె కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లినపుడు, అక్కడ ఆమె మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైనపుడు, ఆమె తెలుగుదేశం పార్టీ నుండి వచ్చారని చాలా మంది చాలా ఇబ్బందులకు గురి చేసారు. కాని వారిని ఒక్క మాట కూడా ఆమె తిరిగి అనే వారు కాదు. '' నేను అక్కడ పార్టీ వ్యక్తిగా లేను, నన్ను

ఎన్‌టిఆర్ గారు ఒక విద్యావేత్తగా, సంఘ సేవకురాలిగా, వైద్యురాలిగానే చూసారు, అంత వరకే '' అని నవ్వి ఊరుకునే వారు కాని వారితో పోట్లాడే వారు కాదు. ఆమె మాలాగ ప్రతి దానికీ ఆవేశపడే వారు కాదు. విషయాల మీద ఆవేదన చెందే వారు. మేము ఆలోచనతో, ఆవేదనతో వున్నప్పటికీ, మాలో ఆవేశం పాలు ఎక్కువ. ఆవేశ పడకుండా వుండడమనేది ఆమె నుంచి మేము నేర్చుకోవాలి.

తరువాత ఆమె బిడ్డలకు కులాంతర వివాహాలు చేసారు. వారి బిడ్డలు చాలా చక్కగా పైకి వచ్చారు. వారి అమ్మాయి మంచి డాక్టరు, ప్రగతి హనుమంతరావు గారి కోడలు. ఆమె కూడా చాలా ఆర్టికల్స్ వ్రాసారు, పేపర్లలో వస్తూంటాయి. ఆమె, ఆమె భర్త, పిల్లలు, చాలా మంచి వారు. ఇక్కడ కూర్చున్నపుడు ఆమెను నేను ఒక రోజు అడిగాను, అమ్మా మీ ఫేస్ చాలా నల్లగా అయిపోయిందెందుకని. అంటే ఒంట్లో బాగుండడం లేదని ఆమె చెప్పారు. ఇప్పుడు అనిపిస్తుంది, అనారోగ్యంతో వుండి కూడా చివరి వరకూ ఈ హౌజ్‌కు వచ్చారు. వారు హాస్పిటల్‌లో వున్నట్లు కూడా నాకు తెలియదు. ఇది చాలా దురదృష్టకరమైన విషయం . ఈ రోజు వారి ఇంటికి వెళతాను.

ఈ సభలో వుండే మహిళలమే చాలా తక్కువ. చక్కటి ఆశయాలు, ఆదర్శాలు కలిగిన విద్యావంతురాలైన మహిళను మనం కోల్పోవడం చాలా విచారకరం . అమె మృతి పట్ల నా సంతాపాన్ని తెలియ జేస్తూ, శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ కె.ఎస్. లక్ష్మణరావు ( గుంటూరు ) : అధ్యక్షా, డా. రాజ్యలక్ష్మి గారు శ్రీ పద్మావతి మహిళా యూనివ ర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా వున్నపుడు, యూనివర్సిటీలో మహిళలకు ఉపయోగపడే అనేక నూతన కోర్సులను ప్రవేశపెట్టారు. ఆమెకు గుంటూరు జిల్లాతో ప్రత్యేకమైన అనబంధం వుంది. గుంటూరు జిల్లాలో, మాచర్ల మండలంలో వున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు అన్నిటినీ సందర్శించి, అక్కడ సమస్యల మీద ఒక ప్రత్యేకమైన నివేదికను తయారు చేసి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గారికి సమర్పించారు.

ఆ సందర్భంగా ఆ పాఠశాలలన్నిటినీ ఆమె సందర్శించేటపుడు నేను కూడా వారితోపాటుగా వెళ్లడం జరిగింది. గుంటూరు జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ చేపట్టిన అన్ని కార్యక్రమాలకూ ఆమె హాజరవడం జరిగింది. అమె మృతి పట్ల నా సంతాపాన్ని తెలియజేస్తూ, శోకార్తులైన ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలి యజేస్తున్నాను.

డా. మసాల పద్మజ (కర్నూలు ) : అధ్యక్షా, డా. రాజ్యలక్ష్మి గారి అకాల మరణం చాలా దిగ్భ్రాంతికరమైన విషయం. ఈ సభలో వున్న ఇద్దరు మహిళలు కాన్సర్ వ్యాధితో మరణించడం జరిగింది. గతంలో శ్రీమతి లక్ష్మీదేవమ్మ గారు, ఇప్పుడు డా. రాజ్యలక్ష్మి గారు, కాన్సర్ వ్యాధితో మరణించడం చాలా బాధాకరమైన విషయం . ఆమె లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబర్‌గా కంటే కూడా ఒక డాక్టరుగా నాకు బాగా తెలుసు.

ఆమె ఎండి, మైక్రోబయాలజీ చేసారు, నేను కూడా ఎండి, మైక్రోబయాలజీ చేయడం జరిగింది. We both of us belong to the same field. ఆమె ప్రొఫెసర్‌గా వున్నపుడు నేను ఎంబిబిఎస్ స్టూడెంట్‌గా వుండే దానిని. నేను ఎండి, మైక్రోబయాలజీ చేసినపుడు I have presented so many papers. ఆ పేపర్లు ప్రెజెంట్ చేసినపుడు ఆమె జడ్జ్‌గా వ్యవహరించడం జరిగింది. ఆ టైమ్‌లో ఆమెను చూసాను. చాలా యాక్టివ్‌గా పాల్గొనే వారు.

10.20 am

మాలాంటి స్టూడెంట్స్‌కు ఎక్కువ సజెషన్స్, గైడెన్స్ ఇచ్చి ముందుకు ఎలా వెళ్లాలనే విషయంలో వారు సూచనలిచ్చేవారు. మరి అలాంటి వ్యక్తితో సమానంగా శాసనమండలిలో ఆమెతోబాటు సభ్యురాలిగా వుండటమనేది నిజంగా నేను అదృష్టంగా భావించాను. ఆమెను చూస్తే, మొట్టమొదటి సారిగా ఒక మహిళా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా వ్యవహరించడమే కాకుండా, డాక్టర్‌గా, సంఘ సేవకురాలిగా కూడా చాలా సేవలు అందించారు. 2007-2009 వరకు కూడా ఉమన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీలో మేమిద్దరం మెంబర్స్‌గా వ్యవహరించడం జరిగింది. ఆ టైంలో కూడా ఆ ఫీల్‌తో ఆవిడ చాలా కంట్రిబ్యూట్ చేయడం జరిగింది. కొన్నిసార్లు మేము బ్లడ్ బ్యాంకులు విజిట్ చేసినప్పుడు కూడా బ్లడ్ బ్యాంకులకు చాలా వేల్యుబుల్ సజెషన్స్ ఇచ్చి, మెంటల్లీ రిటార్డెడ్ పిల్లలకు కూడా చాలా సేవలు చేశారు. అదేవిధంగా మన హౌస్‌లో కూడా మెడికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిగాని, లేదా ట్రైబల్ వెల్ఫేర్ స్టూడెంట్స్‌కు సంబంధించి గాని చాలా స్కూల్స్ ఆవిడ విజిట్ చేయడం జరిగింది. వాళ్ల గురించి ప్రభుత్వానికి మంచి సూచనలు చేయడం కూడా జరుగుతూ వుండేది. She has given valuable suggestions and contributed so much to her field. ఆవిడ మృతిపట్ల తీవ్రమైన సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనశ్శాంతిని, ధైర్యాన్ని ప్రసాదించవలసిందిగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

శ్రీ చిగురుపాటి వరప్రసాదరావు ( కృష్ణా, గుంటూరు ) : అధ్యక్షా, నా తోటి సభ్యురాలు డా.శ్రీమతి కె. రాజ్యలక్ష్మి గారి మృతిపట్ల నా ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తున్నాను. వారి కుటుంబ సభ్యులు ఈ షాక్ నుంచి త్వరగా కోలుకోవాలని, అలాంటి మానసిక స్థైర్యాన్ని ప్రసాదించాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నాను. వారితో నాకు ప్రత్యక్షంగా తక్కువ పరిచయమున్నప్పటికీ, విద్యారంగంలో ముప్పై సంవత్సరాలుగా వున్నటువంటి వ్యక్తిగా, పార్టీలకు అతీతంగా అలాంటి వ్యక్తులు చేస్తున్న కృషిని అభినందిస్తూ, మనం ఈ రోజు నివాళులు అర్పించేటప్పుడు, వారికి నిజమైన నివాళులు అర్పించడమంటే వారు ఎలాంటి మనస్సుతో, ఎలాంటి కాజ్ కోసం జీవితాన్ని త్యాగం చేస్తూ ఒక డిసిప్లెయిన్డ్ లైఫ్ లీడ్ చేశారో అది తోటి సభ్యులకు, ప్రత్యేకించి యూత్‌కి ఆదర్శం కావాలని కోరుకుంటున్నాను. ఈ సభ ద్వారా అదే వారికి నిజమైన నివాళిగా భావించి, వారి మృతిపట్ల సంతాపం తెలిపేందుకుగాను నేను మిమ్మల్ని రిక్వెస్టు చేయగానే మీరు నాకు ఈ విధమైన అవకాశం కల్పించినందుకు మీక్కూడా థ్యాంక్స్ చెబుతున్నాను.

వారికి నిజమైన నివాళులు అంటే అలాంటి వ్యక్తులు ఇవాళ సంఘంలో చాలా, చాలా అవసరం. యూత్‌కి అలాంటి వ్యక్తులు చాలా ఇన్స్పిరేషన్. కాబట్టి వారికి నిజమైన నివాళి అంటే వారి మార్గదర్శకాలు ఫాలో అవుతూ, సభలోని సభ్యులు గాని, బయటవున్న యూత్ గాని అలాంటి వ్యక్తులను మార్గదర్శకంగా ఎంచుకుని, ఆ రకమైన రీడెడికేషన్ చేసుకోవడమే వారికి నిజమైన నివాళిగా భావిస్తూ, మరొక్కసారి వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ఈ షాక్ నుంచి కోలుకునే ధైర్యాన్నివ్వాలని కోరుకుంటూ, అవకాశమిచ్చినందుకు మీకు మరొక్కసారి థ్యాంక్స్ చెబుతున్నాను.

డా. ఎం.వి. రావు (నామినేటడ్)፥ అధ్యక్షా, నాతో ప్రతిరోజూ ఈ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో నా రైట్ సైడ్ కూర్చుని, నాకెన్నో సలహాలిస్తూ వారు గైడ్‌గా వుండేవారు. వారు చనిపోవడం చాలా విచారకరమైన సంగతి. అంతకుముందు రోజే నేను వారి భర్త గారితో ఒక గంటపాటు కూర్చుని మాట్లాడాను. వారి ఆరోగ్యాన్ని గురించి ప్రతి రెండు రోజులకు ఒకసారి తలుచుకుని నేను మాట్లాడుతున్నాను. కానీ, వారికి 11 సంవత్సరాల క్రితమెప్పుడో బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిందట, మళ్లా ఇప్పుడేమో లంగ్ క్యాన్సర్ వచ్చింది. సర్వైవ్ అవ్వడం చాలా కష్టమని పాపం ఆయన చెబుతూ వుండేవారు. నాకు వీరిలో ఎక్కువగా ఇంప్రెస్ చేసిందేమిటంటే వారి పట్టుదల, విల్ పవర్. ఎంత అనారోగ్యంగా వున్నా కూడా సంఘానికి ఏదో ఒక సేవ చేయాలన్న ఉద్దేశం, తపన ఎప్పుడూ ఆవిడకు వుంటూ వుండేది. ఆరోగ్యం బాగాలేకపోయినా, తన కాన్స్టిట్యూయెన్సీకి వెళ్లి ఏదో మంచి చేద్దామనే దృష్టితో పనిచేస్తూ వుండేవారు. వారు పోవడం చాలా దురదృష్టం. కానీ పుట్టిన ప్రతి ఒక్కరూ చనిపోవాల్సిందే. కానీ మనం చనిపోయిన తరువాత మనతో తీసుకువెళ్లేది ఏమిటి? మన సంపాదించిన డబ్బు కాదు. మనం విడిచిపెట్టిన మంచి పేరు తీసుకువెళతాం. ఆవిడ ఎంతో మంచి పేరు తెచ్చుకుంది. ఆ మంచి పేరుతోటే ఆవిడ వెళ్లింది. ఆవిడ ఆత్మకు శాంతి చేకూరాలని నేను భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

శ్రీ జి. తిప్పేస్వామి (అనంతపూర్ ) ፥ అధ్యక్షా, నాతోటి సభ్యురాలు డా. శ్రీమతి కె. రాజ్యలక్ష్మి గారు మరణించడం ఈ హౌజ్‌కు చాలా తీరని లోటు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో వున్నటువంటి ఫ్లోరైడ్ సమస్య గురించి, మరి మేము ఆ జిల్లాలో పుట్టి పెరిగినా కూడా ఆ ఫ్లోరైడ్ సమస్య గురించి ఏ, ఏ గ్రామాల్లో , ఏ, ఏ మండలాల్లో వుందనేది అంత డీటైల్డుగా మాకు తెలియకపోయినా, ఒక డీటైల్డు రిపోర్టు కూడా ఆవిడ నాకు ఇచ్చింది. ఫ్లోరైడ్ గురించి చాలా బాగా రీసెర్చ్ చేసి, అధ్యయనం చేసి సభ దృష్టికి గాని, పై అధికారుల దృష్టికి గాని తీసుకుపోవడంలో రాజ్యలక్ష్మి గారు చాలా బాగా పనిచేశారు. మా జిల్లాకు ఆమె లేని లోటు తీర్చలేనిది. మీరు కూడా ఆమె ఎప్పుడు చేయి చూపించి అవకాశం అడిగినా మాట్లాడేందుకు అవకాశమిచ్చేవారు. ఆమెకు గాని, మన ఎం.వి. రావు గారికి గాని మీరు అవకాశమిచ్చేవారు. మేము ఎప్పుడన్నా చేతులెత్తినా కోప్పడి మమ్మల్ని కూర్చోమని చెప్పేవారు. కానీ, ఆమె మాత్రం ఒక్కసారి చేయి అట్లా అంటేనే మీరు అవకాశమిచ్చేవారు. అంటే ఆమెలోని విషయ పరిజ్ఞానాన్ని సభలోని ఇతర సభ్యులకు, సమాజానికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే మీరు కూడా ఆమెకు చక్కటి అవకాశాలిచ్చేవారు అధ్యక్షా. మరి ఆమె లేనటువంటి లోటుతో ఈ హౌస్ చాలా బాధ పడుతోంది. మరి భవిష్యత్తులో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని, స్థైర్యాన్ని, ఆత్మశాంతిని కలుగజేయాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటూ అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ కన్నా లక్ష్మీనారాయణ (గుంటూరు వెస్ట్ ) : అధ్యక్షా, డాక్టర్ శ్రీమతి కోలా రాజ్యలక్ష్మి గారి మృతిపట్ల శాసనసభా వ్యవహారాల మంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను సంపూర్ణంగా సమర్థిస్తున్నాను. అధ్యక్షా, నేను యువజన కాంగ్రెస్‌లో వున్నప్పటి నుండి ఆమె నాకు బాగా పరిచయం. రాష్ట్ర అధ్యక్షుడిగా సుధీర్ కుమార్ గారు వున్నపుడు, నేను జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వున్నప్పటి నుండి మాతో పరిచయం. కానీ, ఆమె చనిపోవడంతో ఆంధ్ర రాష్ట్రంలో మహిళా లోకం ఒక మంచి మేధావిని పోగొట్టుకున్నట్లయ్యిందీ రాష్ట్రం. ఏ పదవి వచ్చినా ఆమెకు మెరిట్స్ వల్ల వచ్చిన పదవులే తప్ప, ఏదో తెలుగుదేశం వాళ్లు ఒక పదవిచ్చామనో, కాంగ్రెస్ వాళ్లు ఒక పదవిచ్చామనో చెప్పుకోవడమనేటటువంటిది ఆవిడ విషయం పట్ల సరైంది కాదేమోననేది నా భావన.

వైస్ ఛాన్సలర్‌గా పనిచేసినా, అలాగే రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేసినా.. మరీ ముఖ్యంగా రెడ్‌క్రాస్‌లో సెక్రటరీగా వున్నప్పుడు, మన లక్ష్మణరావు గారు చెప్పినట్లు రెడ్‌క్రాస్‌లో అనేక రకాలైనటువంటి మార్పులు తీసుకువచ్చారు. సహజంగా రెడ్‌క్రాస్ అనేది ప్రపంచవ్యాప్తంగా సర్వీసులందించే సంస్థ. అటువంటి సంస్థకు ఆమె ఎక్కడున్నా గుర్తింపు వచ్చేలాగా డెడికేటెడ్‌గా ఉద్యోగంలో వున్నా, పదవి చేసినా, సర్వీసు చేసినా, ఏది చేసినా ఆవిడ ముద్రనేటువంటిది ఒకటి ఉండేలాగా పనిచేసేటటువంటి అలవాటు. తన గురించి గాని, తన ఆరోగ్యం గురించి గాని పట్టకుండా సొసైటీలో సంఘ సేవకురాలిగా వున్నటువంటి ఆమె మన మధ్య లేకపోవడమనేది మనందరి దురదృష్టంగా భావిస్తూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఐలాపురం వెంకయ్య (కృష్ణా ) : అధ్యక్షా, డా. కె. రాజ్యలక్ష్మి గారితో ఈ నాలుగు సంవత్సరాలు శాసనమండలిలో సభ్యునిగా వున్న సందర్భంలో ఆమె ఎంతో మంచి సలహాలిచ్చి, ఈ శాసనమండలికి గాని, ప్రభుత్వానికి గాని చాలా ఉపయోగపడిన పరిస్థితి ఉంది. వారిని ఒకటవ తారీకునాడు తమతోబాటు హాస్పిటల్‌కు వెళ్లి చూసిన సందర్భంలో నాకు చాలా బాధకలిగింది. అలాంటి రాజ్యలక్ష్మి గారు ఈ సభలో లేకపోవడం, భవిష్యత్తులో వారిచ్చే మంచి సలహాలు లేకపోవడం చాలా లోటుగా కనపడుతుందని మనవి చేసుకుంటూ, వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేసుకుంటున్నాను.

శ్రీ జెల్లి విల్సన్ (కృష్ణా ) : అధ్యక్షా, మన సహచర సభ్యురాలు డా. శ్రీమతి కె. రాజ్యలక్ష్మి గారి మరణం విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి వారి భౌతికకాయంపై మా పార్టీ వైపు నుండి, మా వైపు నుండి నివాళులు అర్పించడమనేది జరిగింది. రాజ్యలక్ష్మి గారు, మేమంతా కలిసి ప్రభుత్వ హామీల కమిటీలో సభ్యులుగా వుండేవారం. ఆ హామీల కమిటీ చాలా పక్కాగా, బాగా నడిచే సందర్భంలో వారు చాలా యాక్టివ్‌గా వున్నారు. ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలు మన శాసనమండలిలో వాటిని అమలుజరిపించేందుకు రాజ్యలక్ష్మి గారు ప్రభుత్వ యంత్రాంగంలో వున్నటువంటి నిర్లక్ష్యాన్ని, బాధ్యతరాహిత్యాన్ని ఎప్పుడూ ఆమె సహించేవారు కాదు. చాలా క్రమశిక్షణగా వుండేవారు. ఈ శాసనమండలిలో పూర్తికాకుండా వున్నటువంటి హామీలన్నీ అమలుజరిపి, ప్రజలకు ఉపయోగపడే పద్ధతుల్లో వుండాలని తపించేటటువంటి మనిషి రాజ్యలక్ష్మి గారు. అలాసే వారు

ఎక్కువగా ఆరోగ్యమే కాదు, పేద ప్రజలకు ఫుడ్ సెక్యూరిటీ విషయంలో ఇవ్వాళ కేంద్ర ప్రభుత్వం తీసుకురాదలుచుకున్న ఫుడ్ సెక్యూరిటీని ఏవిధంగా చేస్తే బాగుంటుందనేది కూడా మాతో చర్చించిన సందర్భాలు చాలా వున్నాయి. అటువంటి మేధావి రాజ్యలక్ష్మి గారు.

అలాగే పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా కూడా పనిచేశారని శ్రీమతి నన్నపనేని రాజకుమారి గారు చెప్పారు. వారు వైస్ ఛాన్సలర్‌గా పనిచేసే సమయంలో మాకు డా. కె. నారాయణ గారు విషయం చెప్పారు. ఆయన చెప్పిన సందర్భంలో, రాజ్యలక్ష్మి గారు పద్మావతీ మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా వున్నటువంటి సమయంలో, వారు ఆ విశ్వవిద్యాలయం విస్తృతికి గాని, ఆ విశ్వవిద్యాలయంలో మంచి మేధావులను తయారు చేయడానికి గాని బాగా కృషి చేశారని, ఇప్పటికీ కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆమెకు శిష్యరికం చేసే వాళ్లున్నారనే విషయం మనం గమనించదగ్గది. అలాగే, మేము హామీల కమిటీతోబాటుగా రాష్ట్రంలో పర్యటించే సందర్భంలో ఇటీవల విజయవాడ నగరానికి వెళ్లినప్పుడు, విజయవాడలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేయాలనే విషయంలో దానిమీద ఆమె ఖచ్చితంగా కట్టుబడి చెప్పినటువంటి వ్యక్తి. అలాంటి వారు ఈ సభలో లేకపోవడమనేది చాలా దురదృష్టకరం. ఈ సందర్భంగా నేను వారి మృతిపట్ల సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

ఉ.10.30

శ్రీ డి.రాజేశ్వరరావు ( నామినేటెడ్) : అధ్యక్షా! శ్రీమతి రాజ్యలక్ష్మిగారు మండలి సభ్యురాలిగా మన ప్రక్క సీటులో కూర్చుని ఎన్నో విషయాలు మాట్లాడేవారు. ఇప్పుడు ఈ సభలో ఆమె లేనందుకు చాలా బాధ పడుతున్నాను. ఆమె ఎన్నిసార్లు మాట్లాడినా గవర్నమెంట్‌కు ఎలా రెవెన్యూ రావాలి? హౌజ్ డిఫ్యూట్ అయినపుడు ఎలా డిఫ్యూట్ అవుతారు? ఎలా మాట్లాడతారు? ఈ గవర్నమెంట్‌కు ఏం నష్టం జరుగుతోంది? వాటి నివారణ చర్యల గురించి ఆలోచించేవారు. ముఖ్యంగా ఒకసారి గోల్డ్ విషయంలో చర్చ జరిగినపుడు గోల్డ్ ఎలా తీసుకురావాలి? గోల్డ్ బ్లాక్ మార్కెట్‌లో వెళ్తున్నందువల్ల గవర్నమెంట్‌కు ఎంత నష్టం జరుగుతోంది అనేది వివరించి సూచనలు అందచేశారు. ఛైర్మన్‌గారు తనకు ఎప్పుడు అవకాశం ఇస్తారా అని ఎదురుచూస్తూ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గవర్నమెంట్‌కు మంచి సలహాలు ఇవ్వాలని చూసేవారు. ఛైర్మన్ గారి దృష్టి మళ్ళి రాజ్యలక్ష్మిగారికి అవకాశం ఇచ్చినపుడు ఏ విషయంపైన కానీ ముక్కుసూటిగా సలహాలు, సూచనలు ఇచ్చేవారు. రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీగా ఆమె ఒకసారి నిజామాబాద్‌కి విజిట్ చేశారు. మీరు కూడా ఇటువంటి యాక్టివిటీస్‌లో పాల్గొని రెడ్ క్రాస్ సొసైటీకి, బ్లడ్ బ్యాంక్‌కు ప్రోత్సాహం ఇవ్వమని మమ్మల్ని కోరేవారు. ఆమె ఏ ఆర్గనైజేషన్‌లో ఉన్నా ఆ ఆర్గనైజేషన్ గురించి ఎక్కువగా తెలుసుకుని మా అందరికీ తెలియచేయడం జరిగేది. అలాంటి వ్యక్తి మన మధ్య లేనందుకు చింతిస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ రుద్రరాజు పద్మరాజు ( తూర్పుగోదావరి) : అధ్యక్షా ! జాతస్య మరణం ధ్రువం. పుట్టినవారు చనిపోక తప్పదు. కానీ చనిపోయినవారిలో కూడా గుర్తుంచుకోదగినటువంటి అతి కొద్దిమంది వ్యక్తులలో శ్రీమతి రాజ్యలక్ష్మిగారు కూడా ఒకరు. మాలాంటి యువకులకు విషయం పరిజ్ఞానంలో కానీ, విషయ సేకరణలో కానీ, విషయాన్ని అవగాహన చేసుకోవడంలో కానీ అనేక విషయాలలో ఆయా సందర్భాలలో ఆమె చెప్పేటటువంటి తీరు నన్ను చాలా ఆకర్షించేది. 1973 సంవత్సరం నుండి 1986 సంవత్సరం వరకు ఆమె ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసన్‌కు 13 సంవత్సరాల పాటు సేవలందించారు. తదుపరి శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా సేవలందించారు. 1990 నుంచి 1994 సంవత్సరం వరకు కాంగ్రెస్ పార్టీలో మహిళా విభాగానికి అధ్యక్షురాలుగా ఆమె సేవలందించడం ప్రశంసించదగిన విషయం. ఆమె ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నా కూడా తనదైనటువంటి ముద్రను, శైలిని చూపించినటువంటి మహోన్నతమైన వ్యక్తి. ఆమె క్రమశిక్షణ, అంకితభావం, ఎక్కడ ఉన్నా తన శైలిని ప్రత్యేకంగా చూపడంలో ముందుండేవారు. సుమారు 3 దశాబ్దాలుగా వివిధ రంగాలలో సేవలందించి, ఆ సేవలద్వారా ఆ రంగానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకురావడానికి కృషిచేసిన వ్యక్తిగా ఆమెను నేను చూశాను. ఆమె భౌతికకాయ సందర్శనకు నిన్న నేను వెళ్ళిన సమయానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డిగారు కూడా అక్కడకు వచ్చారు. ఆయన చిన్నతనంలో కూడా శ్రీమతి రాజ్యలక్ష్మిగారు డాక్టర్‌గా బ్లడ్ టెస్ట్ చేయడం చూశానని, ఇప్పుడు కూడా మాకు బ్లడ్ టెస్ట్ చేస్తున్నారని చెప్పారు. అంటే రాజ్యలక్ష్మిగారు ప్రివెంటివ్ మెడిసన్‌లో ఉన్నపుడు ఆ కార్యక్రమాలలో చాలా చురుకైన పాత్ర పోషించేవారని చెప్పడానికి ముఖ్యమంత్రిగారి మాటలను ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

మన సహచరిగా సుమారు 4 సంవత్సరాలు మన సభలో ఉండి అనేకమైనటువంటి అమూల్యమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారు. అనేక కమిటీలలో కూడా ఆమె ప్రాతినిధ్యం వల్ల మిగిలిన సభ్యులందరికీ కూడా ఒక చక్కటి విజ్ఞానాన్ని ఇవ్వడం ఎంతో అభినందనీయం. ఏది ఏమైనప్పటికీ పుట్టినవారు గిట్టక మానరు. సుమారు 80 సంవత్సరాలు జీవించి ఒక డాక్టర్‌గా, ఒక సంఘ సేవకురాలిగా రెడ్‌క్రాస్ సొసైటీలో కానీ, మిగిలిన రంగాలలో కానీ ఆమె చేసినటువంటి సేవలు యావత్ రాష్ట్రానికే కాకుండా, దేశంలోని అనేక ప్రాంతాలలో ఆమెకు సుపరిచితురాలిగా ఎంతో మంచి పేరు తీసుకువచ్చింది. ఆమె మన మండలి సభ్యురాలిగా ఉండడం, ఆమెతో మనకున్నటువంటి స్నేహ సంబంధాలు ఈరోజు లేకపోవడం ఎంతైనా దురదృష్టకరము. భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు మంచి ధైర్యాన్ని ఇచ్చి, ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని నా ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ టి. జి. వి. కృష్ణారెడ్డి (గుంటూరు) : అధ్యక్షా ! కీర్తి శేషురాలు శ్రీమతి కోలా రాజ్యలక్ష్మిగారి సంతాప తీర్మానాన్ని లేజిస్లేటరీ ఎఫైర్స్ మినిస్టర్ శ్రీ శ్రీధరబాబుగారు ప్రవేశ పెడుతూ, శ్రీమతి రాజ్యలక్ష్మిగారు చేసినటువంటి సేవలు సభ్యులందరి దృష్టికి తీసుకువచ్చారు. కానీ ప్రత్యేకంగా శాసనమండలి హామీల అమలు కమిటీ సభ్యురాలిగా ప్రతి కమిటీ మీటింగ్‌కు హాజరై విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కూడా లెక్క చెయ్యకుండా,

వెనుకంజ వేయకుండా ఆమెకు తోచినటువంటి సలహాలు, సూచనలు చేసి హామీల విషయంలో పట్టుబట్టి సాధించేవారు. వైద్య, విద్యా రంగాలలోనే కాకుండా, రెడ్‌క్రాస్‌లాంటి సంఘసేవల విషయంలో, హామీల విషయంలో ఇంకా లోతైన అధ్యయనం చేయడానికి ప్రయత్నించేవారు. మేము ఏమైనా వారించినా కానీ ''లేదు ఈ హామీ ఈ విధంగా అమలు జరపాలని'' పట్టుబట్టేవారు. ఆమె అనారోగ్యం మాకు తెలిసి మేము వారించినా ఆమె వినకుండా ఓపికున్నంతవరకు హామీల అమలు కమిటీ పర్యటనలకు కూడా వస్తానని చెప్పి వచ్చేవారు. చిట్టచివరగా మేము గోదావరి నదిపై నడిచే పడవల గురించి దానికొక కమిటీ వేయాలని ఉద్దేశ్యంతో మేము వెళ్ళినపుడు ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించి బ్రెస్ట్ క్యాన్సర్‌తోపాటు శ్వాసకోస సంబంధమైనటువంటి కేన్సర్‌తోకూడా బాధపడ్డారు. అప్పుడు ''అమ్మా ఇంటికి వెళదామంటే'' ఆమె ఒప్పుకోకుండా ''ఈ పర్యటన పూర్తయ్యాకే ఇంటికి వెళతానని'' చెప్పి పర్యటన పూర్తయ్యేంతవరకు ఉండి సలహాలు, సూచనలు అందేచేశారు. అలాంటి పట్టుదల, స్వయం కృషి ఉన్నటువంటి రాజ్యలక్ష్మిగారిని కోల్పోవడం మన దురదృష్టం. శోకతప్త కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ శెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కందుల లక్ష్మీ దుర్గేష్ ప్రసాద్ (తూర్పుగోదావరి) : అధ్యక్షా ! మానవ జీవితం వైచిత్రి ఏమంటే 13 సంవత్సరాలపాటు ప్రివెంటివ్ మెడిసన్‌లో చాలా ముఖ్యమైన భూమిక వహించినటువంటి రాజ్యలక్ష్మిగారు తనకు వచ్చేటటువంటి అనారోగ్యాన్ని ప్రివెంట్ చేసుకోలేకపోవడమనేది మానవజీవితానికి సంబంధించి ఒక పెద్ద లోపం. ఆ రకంగా ఆమె మన మధ్య నుంచి సుదూర తీరాలకు వెళ్ళిపోవడం చాలా బాధ కలిగించే విషయం. ఒక విద్యా వేత్తగా, రాజకీయ వేత్తగా ఆమె చేసినటువంటి సేవలు ఒక పక్కన పెడితే, సంఘ సేవలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్ర స్థాయిలో చీఫ్‌గా ఉండి ఆమె ఆ భూమిక నిర్వహిస్తున్నటువంటి సమయంలోనే ఆమెతో పనిచేసేటటువంటి భాగ్యం నాకు కలిగింది.

ఒకసారి కోస్తా తీరమంతా ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడుతోంది. ఆ సందర్భంలో ప్రకృతివైపరీత్యం వచ్చిన తరువాత మనం ఏదో సహాయం చేసేదాని కంటే, ఆ ప్రకృతి వైపరీత్యం రాకముందే మనం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, కమ్యూనిటీలు అవేర్ చేసి వైపరీత్యాలు వస్తే కమిటీలు ఏ విధంగా ఎదుర్కోవాలనే విషయాలపై రాజ్యలక్ష్మిగారితో కలిసి ఉభయ గోదావరి జిల్లాలలో మేం పనిచేయడం జరిగింది. స్వచ్ఛంద సేవా సంస్థల కెపాసిటీ బిల్డింగ్ విషయంలో రాజ్యలక్ష్మిగారితో కలిసి ఈ డిజాస్టర్డ్ ప్రిపేర్డ్‌నెస్ విషయంలో అనేక శిక్షణా కార్యక్రమాలు ఇవ్వడం జరిగింది. ఆ రోజుల్లోనే ఏ విషయం పట్ల అయినా సరే సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలనే దృక్పథాన్ని గుర్తు చేసుకుంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియచేస్తూ ఈ అవకాశాన్ని ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియచేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

ఉ.10.40

శ్రీ జూపూడి ప్రభాకర రావు (నామినేటెడ్) : అధ్యక్షా! మంత్రివర్యులు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానం, మొన్నటి దాకా మన మధ్య ఉన్నటువంటి రాజ్యలక్ష్మిగారు ఈ రోజు లేకపోవడం అనేది చాలా దురదృష్ఠకరం. సభ్యులుచాలా మంది చెప్పినట్లుగా రాజ్యలక్ష్మిగారికి ఈ సమాజంపట్ల ఉన్నటువంటి అంకితభావం చాలా గొప్పది. నేను పర్సనల్‌గా అబ్జర్వ్ చేసిన విషయం ఏమిటంటే she is a great scholar గా ఒక think tank గా కొన్ని పరిస్థితుల్లో తన ఎక్స్‌పర్టిజాన్నీ ప్రదర్శించడం. కొన్ని విషయాలలో రెండుమూడు సార్లు నేను సభలో మాట్లాడినపుడు, సభ నుంచి బయటకి వచ్చిన తరువాత మీరు అవిధంగా కాకుండా ఈ విధంగా మాట్లాడి ఉంటే బాగుండేది అని అడ్వైజబుల్‌గా చెప్పినటువంటి సందర్భాలున్నాయి. ఇవన్నీ కూడా సమాజంపట్ల, చివరి వరకూ కూడా సమస్యలతోటి ప్రయాణం చేసేటటువంటి విధానం ఆవిడకున్నటువంటి గొప్ప అంకిత భావాన్ని తెలియచేస్తాయి. గవర్నర్ కోటాలోకి రాజ్యలక్ష్మిగారు రావడం అంత సులువైనటు వంటి విషయంకాదు. అంత ఎక్స్‌పర్థిజం, అంత థింకింగ్ నేచర్ కలిగినటువంటి రాజ్యలక్ష్మిగారు ఈ రోజు మన మధ్యన లేకపోవడం తన కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా తీరని లోటుగా భావిస్తూ మంత్రిగారు ప్రవేశ పెట్టినటువంటి తీర్మానాన్ని రాజ్యలక్ష్మి గారు లేని లోటుని తీర్చలేము కానీ రాజ్యలక్ష్మి గారి ఆశయాల్ని కొనసాగించడం కోసం తోటి సహచరులుగా మనం ముందుకు తీసుకుపోవడమే నిజమైనటువంటి నివాళులుగా భావిస్తూ మీరిచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

శ్రీ షేక్ హుస్సేన్ (నామినేటెడ్) : అధ్యక్షా! శ్రీకృష్ణ భగవానుడు గీతోపదేశంలో ఒక మాట చెపుతాడు. "విడిచి పుత్రుల ధర్మం కర్మ సూత్ర సంసస్థత సృష్టిఎల్ల సహజంబులు తప్పవు చావుపుట్టుకలు. ప్రార్థన పుణ్యా పాపములు ప్రాణులకున్ సుఖ దుఃఖ హేతువుల్ ". ప్రతి ఒక్కరూ చనిపోయినా, వాళ్ళు మనతో పంచుకున్నటువంటి అనుభూతులు, వాళ్ళీ సమాజానికి చేసినటువంటి సేవ శాశ్వతంగా వదిలిపెట్టిపోతారు. ఆ విధంగానే రాజ్యలక్ష్మి గారు అంకిత భావంతో విద్యా, సేవా రంగాలలో చేసినటువంటి కృషికి మహా మనీషిగా చిరస్మరణీయురాలు అని నేనభిప్రాయపడుతున్నాను. ఒక మేధావిగా గవర్నర్ కోటాలో నాతోపాటూ ఆమె నామినేట్ అయినారు. రాజ్యలక్ష్మిగారు ఈరోజు కాలము పూర్తి కాకుండానే వెళ్ళిపోవడం కొంత బాధాకరమైనటువంటి విషయం అని నేనభిప్రాయపడుతూ ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ చెంగల్‌రాయుడు (కడప) : అధ్యక్షా! శాసనసభ వ్యవహారాల శాఖామాత్రులు ప్రతిపాదించినటువంటి సంతాప తీర్మానాన్ని పూర్తిగా సమర్థిస్తూ రాజ్యలక్ష్మిగారు లేని లోటు, మనందరి సభ్యులు వెలిబుచ్చినటువంటి అభిప్రాయాలతో నూటికినూరుపాళ్ళూ ఏకీభవిస్తూ కొన్ని ముఖ్యమైనటువంటి సంఘటనలనూ, ఆమెతో గడిపినటువంటి పరిస్థితులనూ తమ ద్వారా సభదృష్టికి తీసుకువస్తున్నాను. ఒక కుగ్రామంలో పుట్టినటువంటి రాజ్యలక్ష్మిగారు, ఆంధ్రాయూనివర్సిటీలో ఫస్ట్‌బ్యాచ్ మెడికో అని ఆమె మాకు చెప్పడం జరిగింది. ఆ క్రమేణా

రాజ్యలక్ష్మి గారు చదువుకోవడం, ఆ తరువాత చిత్తూరు జిల్లాలో కోళ్ళ రఘువెంకయ్య గారితో వివాహం జరగడం, కాలక్రమేణా రెండు మెడికల్ కాలేజీలకు భార్యాభర్తలిద్దరూ ప్రిన్సిపాల్స్‌గా పనిచేయడం ఆ కుటుంబానికే దక్కింది. తరువాత డైరెక్టర్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్, ప్రపంచానికి కావలసిటువంటి మెడిసన్ ఆంధ్రప్రదేశ్ లోనే తయారుచేయడం, ఆంధ్రప్రదేశ్ హైదరాబాదులోనే బల్క్‌డ్రగ్‌కి పెద్దపీట వేసిన ఘనత రాజ్యలక్ష్మి గారికే దక్కుతుంది. ఈ విషయంలో ఆమె ఎంతో శ్రద్ధ కనపరిచినారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నిధులని కూడా ఆ డ్రగ్స్‌కోసం తెప్పించినటువంటి సంఘటనలు కూడా చాలా వున్నాయి. తరచుగా రాజ్యలక్ష్మిగారు ఢిల్లీకి వెళ్ళి ఆ డబ్బులు తెచ్చుకోవడంలో, మెడికల్ రంగానికి చేసినటువంటి కృషిని గుర్తు పెట్టుకొని ఆనాటి ముఖ్యమంత్రిగారు పెద్దలు శ్రీ స్వర్గీయ ఎన్.టి. రామారావు గారు ఇలాంటి ఒక బలహీన వర్గానికి మేథోసంపత్తిని కలిగినటువంటి వ్యక్తిని వైస్‌ఛాన్స్‌లర్‌గా ఒక మహిళా యూనివర్సిటీకి తీసుకురావాలనేటువంటి ఉద్దేశ్యంతో, ఒక యూనివర్సిటీ అభివృద్ధి కావాలంటే వైస్‌ఛాన్సలర్ యొక్క పనితనాన్నిబట్టి వుంటుంది. మిమ్మల్ని ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి ఒక మహిళా యూనివర్సిటీకి వైస్‌ఛాన్స్‌లర్‌ని చేస్తున్నాము మీరక్కడే ఉండి డెవలప్ చేయాలి అన్నారు. ఈ రోజు ఆ మహిళా యూనివర్సిటీ అంత పెద్ద స్థాయికి వెళ్ళిందంటే అది ఆమె చేసినటువంటి కృషి ఫలితం అని నేను తెలియచేస్తున్నాను. ఆదే సందర్భంలో ఆనాటి గవర్నర్‌గా ఉన్నటువంటి కుముద్బెన్‌జోషి గారితో మంచి సంబంధాలు పెట్టుకోవడం, రాజ్యలక్ష్మిగారి సర్వీసులన్నీ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియానుంచి నిధులు తీసుకురావడం, రాష్ట్రప్రభుత్వ నిధులు సరిపోకపోయినాకూడా దేవస్థానం నుంచి నిధులు కావాలని తీసుకురావడం, ఆ సేవా ధృక్పదము, స్పూర్తితోనూ రాజకీయాలలోకి రావాలని కుముద్బెన్ జోషి గారు కోరినప్పుడు, వైస్‌ఛాన్స్‌లర్ గా ఉంటూనే మహిళా కాంగ్రెసు బాధ్యతలు చేపట్టారు రాజ్యలక్ష్మి గారు. ఈ మధ్య లంగ్‌కాన్సర్ గురించి చెపుతూ నేను అధికారంలో ఉండగానే చనిపోతాను అని నా జాతకంలో ఉంది, ఆఫీసులో ఉండగానే నేను చనిపోతాననిచెప్పడం, ఇంత త్వరగా మననుండి శాశ్వతంగా వెళ్ళిపోతారని నేననుకోలేదు.

ఉ.10.50

అధ్యక్షా, అస్యురెన్స్ కమిటీ విశాఖ పట్టణంలోని కొన్ని ప్రదేశాలను విజిట్ చేయడం జరిగినప్పుడు చేపల అన్నవరంలో ఉన్న ఒక హాస్టల్‌లో చాలా తక్కువ సంఖ్యలో పిల్లలున్నారని కమిటీ దృష్టికి వస్తే.. అక్కడ హాస్టల్ పరిస్థితిని, ఆ పిల్లల పరిస్థితిని చూడాలనిపించి మీరు వెళ్లండని మాతో చెప్పి, ఆమె గారు ఒక్కరే హాస్టల్‌కు వెళ్లి తిరిగి రాత్రి గం.11.30లకు వచ్చారు. అక్కడ 140 మంది పిల్లలుంటే, 7 మంది పిల్లలు హాజరయ్యారనీ, ఇది చాలా దురదృష్టకరమని ఆమె గారు ఇచ్చిన రిపోర్టులో పేర్కొనడం జరిగింది.

నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ బాధిత గ్రామాలను చూడడానికి కమిటీ వెళ్లితే, ఫ్లోరైడ్‌ను తీసివేసి మంచినీరు ప్రజలకు ఇస్తున్నామనీ, పనికి రాని నీటిని పంట పొలలాపై వదులుతున్నట్లు అక్కడ అధికారులు తెలియజేస్తే, పంట ద్వారా కూడా ఫ్లోరైడ్ అఫెక్ట్ అవుతుంది కాబట్టి ఫ్లోరైడ్ తీసివేసినటువంటి నీటినే పంట పొలాలకు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఒక పుస్తకాన్ని రచించడం జరిగిందని చెబుతూ, ఆ పుస్తకాన్ని మాకందరికి చూపించడం జరిగింది. ఈ సంవత్సరం జనవరి 6,7 వ తేదీలలో తిరుపతి విజిట్‌కు వెళ్లినప్పుడు, వెటర్నరీ యూనివర్సిటీలో సమావేశం

జరుగుతున్నపుడు, మా ప్రక్కనే కూర్చొని ఉన్న ఆమె ఒకేసారి ప్రక్కకు వాలి పడి పోవడం జరిగింది. సడన్‌గా పడిపోతే ఇటువంటి సంఘటన ఏమన్నా జరుగుతుందా అని భయమేసింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్ళి పరీక్ష చేయిస్తే, ఎక్కువ డోసు ఉన్న మాత్రలను వాడినందున నిద్ర ఎక్కువగా వచ్చిందనీ, అంతకన్నా ఏమీ లేదని డాక్టర్లు తెలపడం జరిగింది. తిరుమలకు దర్శనానికి వస్తానని చెప్పి రాలేనంటే, వీల్ ఛైర్‌లో తీసుకువెళ్ళి దర్శనం చేయించడం జరిగింది. అప్పుడు దర్శనం చేసుకున్న తరువాత, నేను ఇక సెషన్ ముఖం చూడలేనేమో చెంగల్ రాయుడు గారూ, ఈ విషయాన్ని ఛైర్మన్ గారిని తెలియజేయమని అంటే, అమ్మా ఏదైనా శుభ వార్త అయితే ఛైర్మన్ గారికి చెప్పగలను కాని, ఇటువంటి అశుభ వార్తను ఛైర్మన్ గారికి ఎలా చెప్పేది, అది నా వల్ల కాని పని అని ఆమెతో చెప్పడం జరిగింది. ఈ సమావేశాలు ప్రారంభం కాకముందు ఆమె ఆసుపత్రిలో జాయిన్ కావడం జరిగింది. నేను ప్రతిరోజు ఆసుపత్రికి వెళ్లి పలకరించి రావడం జరుగుతోంది. వివేకానంద ఇనిస్టిట్యూట్‌లో మంచి ట్రీట్‌మెంట్ జరుగుతుందనే ఉద్దేశ్యంతో నిమ్స్‌కు వద్దని వాళ్ల పెద్దమ్మాయి సలహా ఇవ్వడంతో, అక్కడే ట్రీట్‌మెంట్ జరుగుతోంది. మొన్న ఉదయాన్నే నేను ఆసుపత్రికి వెళ్లితే ఎప్పుడు వచ్చావని అంటూ, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరుతూ, గిరిజనుల గురించి ఎక్కువ వర్కవుట్ చేసుకోవాలని చాలా తక్కువ స్వరంతో చెప్పడం జరిగింది. మంగళవారం రాత్రి గం.11.30లకు నేను అసుపత్రికి వెళ్లితే, మంగళవారం రోజు చనిపోకూడదు కాబట్టి శ్వాస పెట్టామనీ, బుధవారం ఉదయాన్నే శ్వాసను తీసివేస్తే ఆమె చనిపోతుందని అక్కడ డాక్టర్లు చెప్పినప్పుడు ఆమెకు కొంచెం స్పృహ ఉంది. అప్పుడు నేను అమ్మా, ఇంటికి వెళదామా అని నాల్గయిదు సార్లు అడిగినా కూడా వినిపించుకోలేదు. ఇంటికి వెళ్లాలని ఉంటే కళ్లు ఆర్పితే నేను ఇంటికి తీసుకువెళ్లతానని చెప్పాను. అప్పుడు వాళ్ల పెద్దమ్మాయి, చిన్నల్లుడు కూడా అక్కడే ఉన్నారు. అడిగిన వెంటనే కళ్లు ఆర్పింది. ఆ కళ్లు ఆర్పడంతోనే ఆమె చనిపోయిందనే నిర్ధారణకు రావడం జరిగింది. ఉదయం గం.3.30ల వరకు అక్కడే ఉండి, వేరే ప్రోగ్రాం ఉండడం వల్ల కడప వెళ్లవలసి వచ్చింది. ఆమె గారు లేని లోటు వైద్య రంగానికి కొట్టచ్చినట్లు కనపడుతుంది. ఎక్కడకు వెళ్లినా కుండ బద్దలు కొట్టినట్లు తమ అభిప్రాయాన్ని చెప్పేవారు. మెడికల్ కాలేజీలో అస్యూరెన్స్ గురించి విజయవాడకు కమిటీ వెళ్లినప్పుడు, ఎలాంటి పరిస్థితులల్లో అయినా ఈ హామీని ఖచ్చితంగా అమలు చేయాలని చెప్పి ఆమె గారే డ్రాఫ్టింగ్‌ను తయారు చేశారు. ట్రైబల్ గురించి, వుమన్ గురించి ఆమె గారికి పెద్ద అవగాహన ఉంది. ఆడవాళ్లు ఏ విధంగా, ఏఏ రంగాల్లో ముందుకు పోవాలనే దాని మీద కూడా స్టడీ చేసినటువంటి వ్యక్తి ఆమె. ఆమె మాట్లాడిన మాటలు గురించి ఆమె ఈ లోకంలో లేని సమయంలో మాట్లాడుకోవడం చాలా బాధాకరంగా ఉంది. ఈ ఆరు సంవత్సరాలు ఎం.ఎల్.సీగా ఇక్కడనే గడుపుతాననే ఉద్దేశ్యంతో ఆమె ఉన్నారు. దురదృష్టవశాత్తు పరమపదించారు. మానవుడు పుట్టడం, గిట్టడం సహజం. ఆమె చేసిన సర్వీసు సభ్యులందరికీ స్ఫూర్తి కావాలని కోరుకుంటున్నాను. చిత్తూరు జిల్లాను ఆప్ట్ చేసుకొన్న ఆమె గారు, జిల్లా రెవ్యూ సమావేశాలకు తప్పనిసరిగా వెళ్లాలనేవారు. జిల్లా రెవ్యూ సమావేశం ఉందని రఘువీరా రెడ్డి గారు ఫోనులో చెప్పారు కాబట్టి నేను తప్పనిసరిగా వెళ్లాలని ఒకసారి అంటే.. ఈ పరిస్థితులలో మీరు ప్రయాణం చేయలేరు కాబట్టి చాలించుకోమని చెప్పినా కూడా వినకుండా సమావేశానికి వెళ్లారు. ఇంత పెద్ద వయస్సులో కూడా డెడికేటెడ్‌గా సమయాన్ని కేటాయించి పనిచేసినటువంటి ఆమె స్ఫూర్తి మనందరికీ ఆదర్శం కావాలని కోరుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలనీ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని

కలుగజేయాలని భగవంతుని కోరుకుంటూ, ఈ అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

డా. కె. రోశయ్య (నామినేటెడ్) : అధ్యక్షా, రాజ్యలక్ష్మి గారి మరణం పట్ల, మంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని హృదయపూర్వకంగా బలపరుస్తున్నాను. గత 30 సంవత్సరాలుగా, రాజ్యలక్ష్మి గారు వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తుంటే చూచిన వాళ్లలో నేను కూడా ఒకడిని. మంచి విద్యాధికురాలు. కేవలం విద్యాధికురాలే కాకుండా సర్వీస్ మైండ్ ఉన్న లేడీ. ఐపిఎమ్ డైరక్టర్‌గా చాలా మంది పనిచేశారు. ఇంకా కొంతమంది పని చేస్తున్నారు. తనకంటూ, ఒక ప్రత్యేకమైన అధ్యాయాన్ని సృష్టించినటువంటి సేవాతత్పరత కలిగిన మహిళ ఆమె. వారు వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన కాలంలో, విద్యా రంగంలో సంస్కరణలకు, మహిళల్లో విద్యాధికతను పెంచేదానికి పట్టుదలతో కృషిచేసిన మహిళ ఆమె. అలాగే, రెడ్‌క్రాస్ సంస్థలో కూడా నిరంతరాయంగా సేవ చేస్తూ వచ్చే వారు. శాసనమండలిలో సభ్యురాలిగా ఆమె అందరికీ పరిచయం ఉన్న వారు. ఎప్పుడూ, తన గురించి కాని, తన కుటుంబం గురించి కాని ఆలోచించే తత్వంతో కాకుండా, మంచి సామాజిక స్పృహ కలిగిన విద్యాధికురాలు. కొద్ది కాలం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కూడా ఆమె పని చేశారు. ఆ రోజుల్లో కాంగ్రెస్ కార్యాలయమైన గాంధీభవన్‌లో నేను నిత్యం ఆమెతో మాట్లాడం జరిగేది. అన్ని జిల్లాలను పర్యటిస్తుండే వారు. ఓపిక లేకపోయినా తెచ్చిపెట్టుకొని పనిచేసే మనస్తత్వం కలిగినటువంటి వారు ఆమె. ఆమె భర్త, ఆమె ఇద్దరూ కూడా డాక్టర్లే. వీరిద్దరే కాదు వాళ్ల పిల్లలు కూడా డాక్టర్లని అనుకుంటున్నాను. మంచి సేవా తత్పరతతో కూడిన వృత్తిలో రాణించినటువంటి రాజ్యలక్ష్మి గారు, ఆకస్మాత్తుగా నిన్నటి రోజున మృ తి చెందారనే వార్తను విని బాధ పడిన వాళ్లలో నేను కూడా ఒకడిని. 30 సంవత్సరాల పరిచయాన్ని ఈరోజు ఒక్కసారి మననం చేసుకున్నప్పుడు, ఆమె గారు లేని లోటు శాసన మండలికి, ప్రజా జీవితానికి కొట్టచ్చినట్లు కనపడుతోంది. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులందరికీ నా వ్యక్తిగతమైన ప్రగాఢ సానుభూతిని సభ ద్వారా తెలియపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యస్. రఘువీరారెడ్డి (కళ్యాణదుర్గం) : అధ్యక్షా, శాసన సభ వ్యవహారాల మంత్రి గారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని సమర్థిస్తూ, పరమపదించిన డా. రాజ్యలక్ష్మి గారు అందరి కంటే చాలా భిన్నంగా కనిపించే వ్యక్తి. ప్రస్తుత రోజుల్లో డాక్టర్ వృత్తిలో ఉన్న వారినైనా, రాజకీయంలో ఉన్న వారినైనా, ఉద్యోగంలో ఉన్న వారినైనా ఏ వృత్తిలో ఉన్న వారిని పలకరించినా అసంతృప్తితోనే ఉంటారు. కాని, ఆమె దానికి భిన్నంగా, ఆమె చేపట్టిన ప్రతి పదవిని, ప్రతి బాధ్యతను కూడా సంపూర్తిగా నిర్వర్తించడమే కాకుండా, ఒక ప్రత్యేకమైన మార్కును ఆమె చేపట్టినటువంటి ప్రతి పదవిలో తీసుకువస్తూనే, పూర్తి స్థాయిలో పనిచేశారు. అలాగే, డాక్టర్ వృత్తితో మొదలుకొని గవర్నర్ కోటాలో ఎన్నికైన ఎం.ఎల్.సీ వరకు చిత్తూరు జిల్లా ఇన్–ఛార్జ్ మంత్రిగా ఆమె పనితనాన్ని నేను స్పష్టంగా చూడడం జరిగింది. చిత్తూరు జిల్లా వాసిగా, ఆమె గారు నియోజక వర్గ అభివృద్ధి నిధిని కేటాయించిన తీరు, ఆమె సెలక్ట్ చేసినటువంటి పనులు చాలా సామాజిక స్పృహతో కూడుకున్నటువంటివి. పెద్దలు లక్ష్మీదేవమ్మ గారికి కూడా 15 సంవత్సరాల క్రితం బ్రెస్ట్ క్యాన్సర్ రావడం, నయం కావడం, మరల సంవత్సరం క్రితం లంగ్ క్యాన్సర్‌తో ఆమె చనిపోవడం, అలాగే, 10,11 సంవత్సరాల

క్రితం రాజ్యలక్ష్మి గారికి కూడా బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చి నయం కావడం, మరల లంగ్ క్యాన్సర్‌తో చనిపోవడం అనేది కాకతాళీయం. రాజ్యలక్ష్మి గారికి క్యాన్సర్ వచ్చి, తగ్గిందనే విషయం నాకు తెలియదు.
ఉ.11.00

డా. కె. రాజ్యలక్ష్మి గారు లంగ్ కాన్సర్‌తో చనిపోవడం కూడా కాకతాళీయమే. ఏది ఏమైనా ఆవిడ సీనియర్ మోస్ట్ సభ్యురాలు ఎంతో హుందాగా సభలో పనిచేసి మనకందరకూ ఆదర్శవంతమైనారు. ప్రతిపనినీ బాగా చేయగలుగుతాను అని చెప్పి చాలా సంతృప్తిగా పనిచేసి నిరూపించినటువంటి ఆమెకు ఘనమైన నివాళి తెలియజేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ (గుంటూరు) : సోదరి డా. కె. రాజ్యలక్ష్మి గారు నడచిన బాట, సేవా తత్పరత మరువలేనిది. ఆవిడ సర్వీస్‌మైండెడ్‌గా పనిచేశారని ఇంతకుముందు శ్రీ కె. రోశయ్యగారు చెప్పారు. అది నూటికి నూరుపాళ్లు నిజం. మహిళా కాంగ్రెస్ పార్టీలో ప్రెసిడెంట్‌గా ఉండి, అన్ని జిల్లాలు తిరిగి మన రాష్ట్రానికి తమ అమూల్యమైన సేవలందించారు. సర్వీస్ మైండెడ్‌గా ఉండాలనే ఆవిడ తపన అందరికీ ఉంటే ఈ రాష్ట్రానికి, దేశానికి మహద్భాగ్యం చేకూరుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆమెలేని లోటు మా పార్టీకి, ఈ సభకు ఎంతో ఉన్నది. ఆమె కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియచేస్తున్నాము.

మిస్టర్ ఛైర్మన్ : మన సభకు ఇవి చాలా బాధాకరమైన క్షణాలు. గౌరవ సభ్యులందరూ డా. రాజ్యలక్ష్మిగారి గుణగణాలను పొగుడుతూ, వారితో ఉన్నటువంటి అనుబంధాన్ని జ్ఞప్తి చేసుకోవడం జరిగింది. సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. అందరికీ ఇది చాలా బాధాకరమైన విషయం. ఫిబ్రవరి 1వ తారీఖున నాకు ఫోన్‌చేసి సార్, మన బడ్జెట్ సమావేశాలు ఎప్పుడు మొదలవుతాయి అని అడిగారు. ఇంకా తేదీ నిర్ణయం కాలేదు, తెలిసిన వెంటనే మీకు చెబుతాను అన్నాను. నేను మీ ఆరోగ్యం ఎలా ఉంది అని అడిగితే కుదుటపడుతోంది అని అన్నారు. అయితే, మార్చి 1వ తారీఖు, మంగళవారం సభ వాయిదా పడిన తరువాత నేను వారిని చూడడానికి నేరుగా వివేకానంద హాస్పిటల్‌కు వెళ్లగా, అప్పటికే ఆవిడ స్మారక స్థితిలో లేరు. హాస్పిటల్‌లో డా. రాజ్యలక్ష్మిగారి కొడుకు, కోడలు, మనవళ్లు ఉన్నారు. దాదాపు 45నిముషాలు అక్కడ ఉన్నాము, నాకు చాలా బాధ కలిగింది. ఉత్తమమైన లెజిస్లేటివ్‌ను మనం కోల్పోయాము, ఇది రాష్ట్రానికే తీరని లోటు. వారు అనేక రంగాలలో ముఖ్యంగా మెడికల్ అండ్ హెల్త్‌లో పనిచేశారు. ఆవిడ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా పనిచేసి మంచి పేరును సంపాదించుకొన్నారు. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు క్షుణ్ణంగా ఆలోచించి పరిష్కరించేందుకు దోహదం చేసేవారు. డా. రాజ్యలక్ష్మిగారు రాజ్‌భవన్ ద్వారా రెడ్‌క్రాస్ వంటి సంస్థలకు చేసిన సహాయం మరువలేనిది. అటువంటి మంచి గుణాలను అలవర్చుకొన్న ఆవిడ ఈనాడు మన మధ్య లేకపోవడం తీరని లోటు. నాకు బాగా గుర్తున్న ఒక సంఘటన చెబుతాను. తరచూ ఆవిడ తమను ఎస్టీ కమిటీకి వేయమని అడిగేవారు నాకు చాలా సంతోషమనిపించేది. ఈ విధంగా ఎస్టీ కమిటీకి వేయమని అడిగేవారు చాలా అరుదు. ఆవిడకు ఎస్టీ కమిటీతోపాటు మరో కమిటీని కూడా ఇస్తామని చెప్పినప్పుడు ఆవిడ చాలా సంతోషపడ్డారు. అది నాకు ఎప్పుడూ గుర్తుంటుంది. అణగారిన వర్గాలను పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో, వారికి సేవచేయాలనే తపనతో పదేపదే ఎస్టీ కమిటీ కావాలని అడిగేవారు. గౌరవ

సభ్యులందరి అభిప్రాయాలు సేకరించి, సభ తరఫున ఆవిడకు ఈ విధంగా సంతాపం తెలియజేయడమవుతున్నది.

<u>సంతాప ప్రతిపాదన</u>

" ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన పరిషత్తు సభ్యురాలు డా. (శ్రీమతి) కె. రాజ్యలక్ష్మి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది."

డా. (శ్రీమతి) కె. రాజ్యలక్ష్మి గారు 1931 సంవత్సరము సెప్టెంబర్ 27వ తేదీన చిత్తూరు జిల్లా, పట్టి పుత్తురు గ్రామములో జన్మించారు. వీరు గవర్నర్ గారి ద్వారా 2007వ సంవత్సరంలో శాసన పరిషత్తు సభ్యురాలుగా నామనిర్దేశమైనారు. వీరు శాసన పరిషత్తు యొక్క ప్రభుత్వ హామీల కమిటీ సభ్యురాలుగాను మరియు శాసన మండలి యొక్క షెడ్యూల్డు తెగల కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగాను సేవలందించారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. వీరు వృత్తి రీత్యా వైద్యులు. వీరు 1973-1986 సంవత్సరాలలో వ్యాధి నిరోధక ఔషధ సంస్థకు సంచాలకులుగా పనిచేశారు. వీరు 1986-1990 సంవత్సరాలలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయమునకు ఉప-కులపతులుగా పనిచేశారు మరియు వీరు 2001-2007 సంవత్సరాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యదర్శిగా తమ సేవలందించారు. వీరు దేశ మరియు విదేశీ పత్రికలలో 45కు పైగా వ్యాసాలు రచించారు. సాంఘిక సంక్షేమము యందు ప్రత్యేక శ్రద్ధతో పలు కార్యక్రమాలను చేపట్టారు. వీరు తమ నియోజక వర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

వీరు 2011 సంవత్సరము మార్చి 2వ తేదీన మరణించారు. వీరి వయస్సు 79 సంవత్సరములు.

వీరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషముల పాటు మౌనం పాటిద్దాము.

(గౌరవ సభ్యులందరూ లేచి నిలబడి రెండు నిముషాలు మౌనం పాటించారు.)

MR. CHAIRMAN: The House is adjourned to meet again at 10.00 a.m. on Friday, the $04^{th}$ March, 2011.

(The House then adjourned at 11.13 a.m. to meet again at 10.00 a.m. on Friday, the $04^{th}$ March, 2011.)